క్లుప్తంగా

శంకరన్ సేవలు చిరస్మరణీయం


శంకరన్ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న లెక్చరర్లు

కొత్తపట్నం: సమాజంలోని పేదల అభ్యున్నతికి పాటుపడిన మాజీ ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని అల్లూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు ఉన్నంత కాలం వారి హృదయాల్లో ఎస్ఆర్ శంకరన్ నిలిచిపోతారన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్ట మార్గదర్శకాలను రూపొందించిన మహనీయుడు శంకరన్ అని కొనియాడారు. పేద ప్రజల అభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశంతో తన వివాహం కూడా మానుకున్నాడని అన్నారు. శంకరన్ సేవలను గుర్తించి పద్మభూషణ్‌ను ప్రభుత్వం ప్రతిపాదించినప్పటికీ ఆయన తిరస్కరించారని తెలిపారు. అనంతరం శంకరన్ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ప్రైవేట్ లెక్చరర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.15 లక్షలకు టోకరా


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: ఔట్ సోర్సింగ్ ద్వారా మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి రూ.15 లక్షలు వసూలు చేసి ఒక వ్యక్తి మోసం చేశాడని దోర్నాలకు చెందిన బాధితుడు ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 54 ఫిర్యాదులు వచ్చాయి. బాధితులతో మాట్లాడిన ఏఎస్పీ.. వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆయా పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల వేదిక ఎస్ఐ రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నళినీప్రియ నృత్యానికేతన్ వార్షికోత్సవం


అమ్మవార్ల అలంకరణల్లో నళినీప్రియ నృత్యానికేతన్ చిన్నారులు

ఒంగోలు మెట్రో: నళినీప్రియ కూచిపూడి నృత్యా నికేతన్ 10వ వార్షిక వేడుకలను సోమవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రిని ఘనంగా సత్కరించారు. సాయి పాద సేవకుడు, సంతపేట షిరిడీ సాయి బాబా మందిరం నిర్వాహకుడు అళహరి చెంచలరావు, డాక్టర్ కేఆర్‌వీ ప్రసాద్, శ్రీనివాసమూర్తి, రంగభూమి కళాకారుల అధ్యక్షుడు ధేనువకొండ సుబ్బయ్య పాల్గొని నృత్య సంస్థ చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గాజా యుద్ధంపై మోదీ వైఖరి మారాలి


ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు

ఒంగోలు టౌన్: అమెరికా ప్రోద్బలంతో అధర్మ యుద్ధం చేస్తూ వేలాది మంది పాలస్తీనా వాసులు, చిన్నారుల ప్రాణాలు బలిగొంటున్న ఇజ్రాయిల్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ద్వంద్వ వైఖరి మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ హితవు పలికారు. పాలస్తీనాపై యుద్ధం మొదలై ఏడాది అయిన సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా కుట్రపూరిత ప్రోద్బలంతోనే ఇజ్రాయిల్ నిరంతర దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ దాడుల్లో 50 వేల మందికి పైగా మహిళలు, చిన్నారులు, సామాన్య ప్రజలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో కె.రమాదేవి, ఎం.విజయ, డీవీఎస్ స్వామి, జీవీ కొండారెడ్డి, శ్రీరాం శ్రీనివాసరావు, ఆర్.రామకృష్ణ, జాలా అంజయ్య, ఎస్కే మాబు, చీకటి శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, సాగర్, ఉప్పుటూరి ప్రకాశరావు పాల్గొన్నారు.


కాలనీ వెనుక రోడ్డు పక్కన పోసి తొలగించని చెత్త


మద్దిపాడు బీసీకాలనీ వెనుక కాలువలో పేరుకుపోయిన మురుగునీరు


డొంకబాటను ఆక్రమించి ఏర్పాటు చేసిన పందుల ఆవాసాలు

అడుగడుగునా సమస్యలే..!

- మద్దిపాడు బీసీ కాలనీని చుట్టుముట్టిన సమస్యలు
- సతమతమవుతున్న ప్రజలు
- స్పందించని అధికారులు, పాలకులు

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులోని బీసీ కాలనీ పలు రకాల సమస్యలతో సతమతమవుతోంది. కాలనీలో ఎక్కువ శాతం యువకులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చిరు వ్యాపారాలు చేస్తుంటారు. స్థానికంగా ఉండేవారంతా వృద్ధులు, మహిళలే కావడంతో కాలనీలోని సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితుల్లో సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. అధికారులు, పాలకులు తమ సమస్యల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవంటూ విమర్శిస్తున్నారు.

సమస్యలు ఇవీ...

బీసీ కాలనీకి వెళ్లే దారి గుంతలమయంగా ఉండటంతో వర్షం కురిస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాలనీలోని ఒకే ఒక రోడ్డుకు మాత్రమే సైడు కాలువలు ఉన్నాయి. మిగిలిన రోడ్లకు ఎక్కడా సైడు కాలువలు లేవు. నిత్యం మురుగునీరు రోడ్డుపై ప్రవహించాల్సిందే. ఈ కాలువ పక్కనే ఎంపీపీ స్కూల్ ఉంది. కాలువలో పూడిక తీసేది మూడునాలుగు నెలలకు ఒకసారే అయినా.. తీసిన పూడిక తాలూకా చెత్తను రోడ్డుపైనే వదిలేయడం ఇక్కడి స్పెషాలిటీ. కాలనీ వెనుక వైపు పెద్ద మురికి తటాకం ఏర్పడింది. చింతతోపు నుంచి జాతీయ రహదారికి వెళ్లడానికి ఉన్న డొంకబాట పూర్తిగా అధ్వానంగా మారింది. కాలనీ పక్కనే పెద్ద మురుగు కాలువ ఉంది. అందులో నుంచి మురుగు నీటిని బయటకు పంపాల్సి ఉండగా, కాలువలోని నీరు తమ వైపు రాకుండా కొందరు అడ్డుకట్టలు వేయడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. కాలనీకి వెళ్లే దారిలో చివరిగా ఉన్న ఇంట్లో ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్ నడుపుతున్నారు. కాలనీలోని చెత్త మొత్తాన్ని అంగన్‌వాడీ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన వరలలో కాలనీవాసులు వేస్తున్నారు. ఆ చెత్తను క్లాప్‌మిత్రలు డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. దీంతో చెత్త మొత్తం పేరుకుపోతోంది. మరోవైపు డొంకబాటను ఆక్రమించి పందులకు ఆవాసాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ బాట వెంట నడవాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. కాలనీ వెనుక ఉన్న మురుగు కాలువలో దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులపై దండయాత్ర చేస్తున్నాయి. గత పది రోజుల్లోనే పదుల సంఖ్యలో కాలనీ వాసులు విషజ్వరాల బారినపడ్డారు. అంగన్‌వాడీ సెంటర్, ఎంపీపీ స్కూల్ పరిసరాలు వర్షం పడితే దారుణంగా మారిపోతాయి. ప్రభుత్వం కట్టించిన అంగన్‌వాడీ సెంటర్ పాడుబడిపోవడంతో దానిని మూసివేశారు. దానికి పడగొట్టి దాని స్థానంలో మరో భవనం నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్ అరకొర వసతులతో నడుస్తోంది. దాని పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉండటంతో చిన్నారులు అవస్థ పడుతున్నారు. తమ సమస్యలను ఎవరికి చెబితే పరిష్కరిస్తారో కూడా అర్థంగాక కాలనీవాసులు తలలు పట్టుకుంటున్నారు. పాలకులు అధికారులు తమ కాలనీని పరిశీలించి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కాలువలో తీసిన పూడికను రోడ్డుపైనే వదిలేసిన దృశ్యం


మహాచండీదేవి అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవి


బాలాజీరావుపేట కనకదుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు


అన్నపూర్ణాదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి అమ్మవారు

మహాచండీ.. నమోస్తుతే

దసరా సందర్భంగా దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఒంగోలు నగరంలోని ఆలయాల్లో అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్లకు శ్రీసూక్తంతో పంచామృతాల అభిషేకం, శ్రీ చక్రానికి దేవీ ఖడ్గమాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పలు దేవస్థానాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– ఒంగోలు మెట్రో


లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో పార్వతీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


కేశవస్వామిపేట ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో సంతానలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు


గాంధీరోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పూజలో మహిళా భక్తులు


కూరగాయలతో శాకాంబరి అలంకరణలో గంటాపాలెం పార్వతీదేవి అమ్మవారు

ఆకట్టుకున్న మహాలక్ష్మీ వైభవం ప్రవచనం


చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక ప్రవచనంలో పొన్నూరు శ్రీనివాసులు


సంతపేట సాయిబాబా మందిరంలో ప్రవచనం అందిస్తున్న అగస్త్యరాజుశివ

ఒంగోలు మెట్రో: ఒంగోలు సంతపేట సాయిబాబా మందిరంలో దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు సోమవారం సాయంత్రం శ్రీ మహాలక్ష్మీ వైభవం అంశంపై ప్రముఖ జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి అగస్త్య రాజుశివ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. మహాలక్ష్మి విశిష్ట రూపాలు, ఆరాధన ఫలితాలు, తదితర ఘట్టాలను ఆకట్టుకునేలా భక్తులకు వివరించారు. అనంతరం సాయిబాబా గుడి నిర్వాహకులు అళహరి చెంచలరావు, కమిటీ సభ్యులు అగస్త్యరాజుశివను సత్కరించారు.

కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో...

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రవచించారు. మంత్రి ప్రగడ ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో మంత్రి ప్రగడ నరసింహారావు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన మూడు రోజుల ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమంలో దేవీ అశ్వధాటిపై పొన్నూరు ప్రసంగించారు. దేవస్థాన ఈవో రావెళ్ల శివశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రి ప్రగడ ఆధ్యాత్మిక పీఠం నిర్వాహకుడు మంత్రిప్రగడ వేంకట సత్యప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఏపీపీ యెత్తపు కొండారెడ్డి, నెమ్మని సీతారామమూర్తి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

5 వేల కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ఒంగోలు టౌన్: అర్ధరాత్రి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి చీమకుర్తి నుంచి ఒంగోలు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఏపీ 39 యూఎక్స్ 4423 నంబరు గల మినీ లారీలో ఉన్న 100 బ్యాగులలోని 5 వేల కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని చీమకుర్తి పీడీఎస్‌లో అప్పగించారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్న చీమకుర్తికి చెందిన అయినీడి సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎఫ్ఐ ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.


విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం